సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 21 । మార్చి । 2024



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. అనంతరం కల్యాణం నిర్వహించారు.



23న సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో 23 ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
పాడేరు, అరకు	6.12	4.46
రంపచోడవరం	6.10	4.45

న్యూస్‌రీల్

అరకు పార్లమెంట్ ఆర్‌వోగా పార్వతీపురం మన్యం కలెక్టర్

- పార్లమెంట్ నామినేషన్ల స్వీకరణ పార్వతీపురం మన్యం జిల్లాలోనే



సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అరకులోయ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను ఎన్నికల కమిషన్ నియమించింది. అరకులోయ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆర్‌వో స్వీకరిస్తారు. అభ్యర్థులంతా అక్కడే నామినేషన్లను దాఖలు చేయాలి. అరకులోయ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్‌వోలు.. పార్లమెంట్‌కు సంబంధించి ఏఆర్‌వోలుగా వ్యవహరిస్తారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సేవలపై ఎన్‌క్యూఏఎస్ బృందం సంతృప్తి



లగిసపల్లిలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద ఎన్‌క్యూఏఎస్ బృందం ప్రతినిధులు

పాడేరు : మండలంలోని లగిసపల్లి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఆరోగ్య సేవలపై ఎన్‌క్యూఏఎస్ బృందం ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ జనార్దన్ నాయక్, డాక్టర్ ఇంద్రదీప్ దాస్‌తో కూడిన జాతీయ ఎన్‌క్యూఏఎస్ ప్రతినిధుల బృందం లగిసపల్లిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను బుధవారం సందర్శించింది. మాతా, శిశు సంరక్షణ సేవల తీరు తెన్నులు, విలేజ్ క్లినిక్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, వైద్య పరికరాలు తదితర విషయాలపై ఆరా తీశారు. సిబ్బందితో మాట్లాడి రోగులకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జమల్‌బాషా, మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ, వైద్య సిబ్బంది ఎస్.పి. పడాల్, మాధవి, సరోజిని తదితరులున్నారు.

పలు ప్రాంతాల్లో చిరు జల్లులు



పాడేరులో గొడుగును ఆశ్రయించిన మహిళలు

సాక్షి,పాడేరు: అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. పాడేరుతో పాటు పలు ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారు వరకు తేలికపాటి వర్షం పడింది. బుధవారం ఉదయం ఎండ కాసినప్పటికీ మధ్యాహ్నం నుంచి మళ్లీ పాడేరుతో పాటు పలు ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి.

డిప్యూటీ రేంజర్‌గా అప్పలనాయుడు



జి.మాడుగుల: స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ రేంజ్ అధికారిగా ఆర్.అప్పలనాయుడు బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ వాతావరణ సమతుల్యానికి, మానవ మనుగడకు అడవులు ఎంతో దోహదపడతాయన్నారు. అడవుల పరిరక్షణకు అందరి సహకారం అవసరమని తెలిపారు. ఆయనకు అటవీశాఖ సిబ్బంది శుభాకంక్షలు తెలియజేశారు.

ఆశ్రమోన్నత పాఠశాలల తనిఖీ



చిక్కీ ప్యాకెట్లను పరిశీలిస్తున్న డీడీ అబుసలేం

రాజవొమ్మంగి : మండలంలోని పలు ఆశ్రమోన్నత పాఠశాలలను రంపచోడవరం డీడీ అబుసలేం బుధవారం తనిఖీ చేశారు. రాజవొమ్మంగి బాలికల, బాలుర ఆశ్రమోన్నత పాఠశాలు, సింగంపల్లి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో స్టోరూంలు తనిఖీ చేశారు. నిల్వ చేసిన సరకులను పరిశీలించారు.పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పిల్లలకు మెనూ సక్రమంగా అమలు చేయాలని సంబంధిత వెల్ఫేర్ ఆఫీసర్లకు సూచించారు. హెచ్‌ఎంలు నాగసుశీల, రాజాదినకర్, సుబ్రహ్మణ్యేశ్వరి పాల్గొన్నారు.

పాడేరు దేశంలో అయోమయం

ప్రజల్లో ఆదరణ లేకపోయినా పొత్తులతో గట్టెక్కుదామని తెలుగుదేశం పార్టీ అధిష్టానం వేసిన ఎత్తులు ఇప్పుడు ఆ పార్టీలో సీనియర్ నేతల ఆశలను అడియాసలు చేస్తోంది. పొత్తులో సీటు కోల్పోయే పరిస్థితి నెలకొనడంతో పాడేరు నాయకుల రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. ఇన్నాళ్లు సీటు కోసం పట్టుపట్టి గ్రూపులుగా విడిపోయిన నాయకులు ఇప్పుడు మాలో ఎవరికో ఒకరికి ఇవ్వండి అంటూ వేడుకునే పరిస్థితి ఏర్పడింది. అధినేతను కలిసి తమ గోడు వెల్లబుచ్చుకుందామంటే కనీసం అపాయింట్‌మెంట్ లభించకపోవడంతో అమరావతిలో ఎదురుచూపులతో ఐదు రోజులుగా కాలం గడుపుతున్నారు.

- టీడీపీ నాయకుల టికెట్ ఆశలు అడియాసలేనా ?
- అధినేత అపాయింట్‌మెంట్ కోసం అమరావతిలో పడిగాపులు
- ఐదురోజులుగా దొరకని దర్శన భాగ్యం
- ఈ స్థానం బీజేపీకి కేటాయించినట్టు ప్రచారం



పాడేరు : పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఈ దఫా ఎన్నికల్లో పోటీ చేయాలని గంపెడు ఆశలు పెట్టుకున్న టీడీపీ నాయకులకు చుక్కెదురు కానుంది. పొత్తులో భాగంగా ఈసారి కూడా మిత్రపక్షమైన బీజేపీకి పాడేరు అసెంబ్లీ టికెట్ కేటాయించేందుకు దాదాపుగా కూటమి పార్టీల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ విషయం తెలిసినప్పటి నుంచి పాడేరు నియోజకవర్గంలోని టీడీపీలో టికెట్ ఆశిస్తున్న వారితో పాటు పార్టీ శ్రేణుల్లో కూడా నైరాశ్యం నెలకొంది. గత 20 ఏళ్లుగా ఈ నియోజకవర్గం నుంచి అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేని టీడీపీకి ఈసారి కూడా పోటీ చేసే అవకాశం లేకపోతే దాదాపుగా పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని నాయకులు, కేడర్ ఆందోళన చెందుతున్నారు. ఎలాగైన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని కలిసి పరిస్థితిని వివరించి టీడీపీకి పాడేరు టికెట్ కేటాయించేలా ఒత్తిడి తేవాలని భావించినా ఆ ప్రయత్నాలు సఫలం కావడం లేదు.

రెండు సార్లు ఓటమి... రెండు సార్లు పోటీకి దూరం

1999లో పాడేరు నియోజకవర్గంలో టీడీపీ విజయం సాధించింది. ఆ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన మత్స్యరాస మణికుమారి 2004 వరకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన మణికుమారి ఘోర ఓటమి పాలయ్యారు. 2009, 2014 ఎన్నికల్లో మిత్రపక్షాలకు టికెట్ కేటాయించడంతో పోటీ చేసే అవకాశం దక్కలేదు. ఇక 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన ఫిరాయింపు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి నియోజకవర్గ ప్రజలు తమ ఓటుతో సరైన గుణపాఠం చెప్పడంతో ఘోరంగా ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా గిడ్డి ఈశ్వరి కొనసాగుతున్నారు.

వర్గ పోరు

టీడీపీలో ముందునుంచి టీడీపీలో మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, సీనియర్ నేత బొర్రా నాగరాజు, మాజీ ఎమ్మెల్యే తనయుడు, మాజీ జీసీసీ చైర్మన్ ఎంవీఎస్ ప్రసాద్, మాజీ అధికార ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు ఉన్నారు. అప్పటి నుంచే టీడీపీలో వర్గ పోరు నడుస్తోంది. ఇక 2024 ఎన్నికల సమయానికి ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసిన కిల్లు రమేష్‌నాయుడు, టీడీపీ మాజీ అధికార ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావులతో మరో రెండు వర్గాలు తయారయ్యాయి. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టీడీపీ మాజీ అధికార ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు, మాజీ జీసీసీ చైర్మన్ ఎంవీఎస్ ప్రసాద్, కిల్లు రమేష్‌నాయుడు టికెట్ ఆశిస్తున్నారు.

వర్గాలతో సతమతమవుతున్న పాడేరు టీడీపీలో ఎవరికి టికెట్ ఇచ్చినా మిగతా వారు సహకరించరని భావించి పొత్తుల్లో భాగంగా ఈసారి కూడా పాడేరు అసెంబ్లీ స్థానాన్ని బీజేపీకి కేటాయించేందుకు టీడీపీ అధిష్టానం నిర్ణయించుకున్నట్టు విస్తృతంగా ప్రచారం సాగుతోంది. **పది రోజుల కిందట విజయవాడకు వెళ్లిన టీడీపీ టికెట్ ఆశావాహులకు పొత్తుల్లో భాగంగా ఈసారి పాడేరు అసెంబ్లీ టికెట్‌ను బీజేపీకి కేటాయిస్తున్నట్టు కరాఖండీగా అధిష్టానం చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఈనెల 18న తన అనుచరులతో తన నివాసం వద్ద అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 15న** తన అనుచరులతో పాడేరు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, బల ప్రదర్శన జరిపారు. ఈసారి పాడేరు అసెంబ్లీ టికెట్ బీజేపీకి కేటాయిస్తే టీడీపీ శ్రేణులు పార్టీకి దూరమయ్యే అవకాశం ఉందని, పైగా అంతగా పట్టులేని బీజేపీకి టికెట్ ఇస్తే ఓటమి తప్పదని నినాదించారు. పార్టీ కింద స్థాయి కేడర్, ఆశావాహుల అనుచరుల ఒత్తిడి మేరకు వర్గాలుగా ఉన్న టీడీపీ నాయకులు ఒక్కటయ్యారు. తమలో ఎవరికి టికెట్ ఇచ్చిన గెలిపించుకుందామని వారంత నిర్ణయించుకున్నారు.

బీజేపీకే టికెట్

పొత్తుల్లో భాగంగా పాడేరు అసెంబ్లీ స్థానాన్ని బీజేపీకి కేటాయించేశారని, ఈ విషయంలో ఎటువంటి పునరాలోచన లేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని తమ పార్టీ అధిష్టానం స్పష్టం చేసిందని, అయినప్పటికి మళ్లీ టీడీపీకి కేటాయించాలని వెంపర్లాడటం కరెక్ట్ కాదని బీజేపీ నాయకులు అంటున్నారు.

అమరావతిలో పడిగాపులు

వర్గాలుగా ఉన్న తామంతా ఒక్కటయ్యామని, ఈసారి టీడీపీకి టికెట్ కేటాయించాలని, పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును కలిసి చెప్పుకుందామని పార్టీకి చెందిన టికెట్ ఆశావాహులు ఐదు రోజుల క్రితం అమరావతి వెళ్లారు. అప్పటి నుంచి అధినేత దర్శన భాగ్యం కోసం ఎదురు చూస్తున్నారు. పొత్తుల్లో భాగంగా మిత్ర పక్షమైన బీజేపీకి పాడేరు నియోజకవర్గం స్థానం దాదాపుగా కేటాయించినందునే పాడేరు నాయకులకు అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు చంద్రబాబు నాయుడు ఇష్ట పడడం లేదని వినికిడి. ఒక వైపు వైఎస్సార్‌సీపీ తమ అభ్యర్థులకు ప్రకటించి ముమ్మరంగా ప్రచారం చేస్తుండగా పాడేరు నియోజకవర్గంలో పొత్తుల్లో భాగంగా ఏ పార్టీకి టికెట్ కేటాయిస్తారో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులకు అంతుపట్టడం లేదు. టికెట్ కేటాయింపు విషయంలో మూడు పార్టీల్లో స్పష్టత లేకపోవడంతో ఇప్పటికే టీడీపీలో ఉన్న కిందస్థాయి నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నారు.

వైఎస్సార్‌సీపీ పరిశీలకుల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అల్లూరి జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించారు. పాడేరుకు శ్రీకాంత్ రాజు, పీలా వెంకట లక్ష్మి, అరకు నియోజకవర్గానికి శోభా హైమావతి, జల్లిపల్లి సుభద్రలను నియమించారు. ఈ మేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రశాంత ఎన్నికలకు అన్ని పార్టీలు సహకరించాలి

రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగే విధంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్, ఆర్‌వో ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రంపచోడవరం, చింతూరు డివిజన్లో మొత్తం 11 మండలాల్లో 399 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎన్నికల నిర్వహణకు 59 మంది సెక్టోరియల్ అధికారులను, రూట్ అధికారులను నియమించినట్టు తెలిపారు. ఈవీఎంల భద్రపరిచేందుకు రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహ ప్రాంగణంలో స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ జూనియర్ బాలికల కాలేజీలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు పి. శ్రీనివాసరావు, ఎస్.బొజ్జిరెడ్డి, పి.అనంత మోహన్, చుక్క సంతోష్ కుమార్, పి.కృష్ణారెడ్డి, శ్రీరామ్ కుమార్, డీటీలు ఎస్.వి.వి సత్యనారాయణ, సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్లు టి.లక్ష్మణ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

'సింగిల్ విండో'లో అనుమతులు



మాట్లాడుతున్న పాడేరు, అరకులోయ ఆర్‌వోలు భావన వశిష్ఠ్, వి.అభిషేక్‌లు



శిక్షణకు హాజరైన పలు విభాగాల నోడల్ అధికారులు, సిబ్బంది

పాడేరు, అరకు ఆర్‌వోలు భావన వశిష్ఠ్, అభిషేక్

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులకు సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తామని పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు భావన వశిష్ఠ్(జేసీ), వి.అభిషేక్(ఐటీడీఏ పీవో)లు తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఐటీ బృందాలకు ఎన్నికల పోర్టల్స్ నిర్వహణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వోలు మాట్లాడుతూ సువిధ, సి-విజిల్, ఎన్-కోర్, ఈఎస్‌ఎంఎస్ యాప్‌లపై అవగాహన ఏర్పర్చుకోవాలని తెలిపారు. సువిధ యాప్ నుంచి ప్రచారాలకు దరఖాస్తులు స్వీకరించి, ఎన్-కోర్ యాప్ నుంచి అనుమతులు జారీ చేస్తామన్నారు. రిటర్నింగ్ అధికారుల ఆమోదం లేకుండా ఎలాంటి అనుమతులు జారీ చేయకూడదని చెప్పారు. సిబ్బంది సొంత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు,అభ్యర్థులు అన్ని రకాల ప్రచార కార్యక్రమాలకు ఆర్‌వోల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, అభ్యర్థులు,ఏజెంట్లు ఎన్నికల నియమావళి, యాప్‌లపై అవగాహన చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీలు బి.వి.ఎస్.శర్మ, అంబేడ్కర్, సీపీవో ఎస్.ఆర్.కె.పట్నాయక్, ఎంపీడీవో సాయినవీన్, జీడబ్ల్యూఎస్ సమన్వయకర్త సునీల్, పలువురు నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో అప్రమత్తం

- ఎస్పీ తుహిన్‌సిన్హా
- సబ్ డివిజన్ పోలీసులతో సమీక్షా సమావేశం

చింతూరు: సార్వత్రిక ఎన్నికల్లో మావోయిస్టులు అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. చింతూరు సబ్ డివిజన్ పోలీసులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి బుధవారం ఆయన చింతూరులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌లకు గట్టి భద్రత కల్పించాలని, నిఘా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో తమ ఉనికిని చాటుకునేందుకు మావోయిస్టులు విధ్వంసకర ఘటనలకు పాల్పడే అవకాశముందని, ముందుగానే సరిహద్దుల్లో అదనపు బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేయాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ నాయకుల భద్రత కల్పించే విషయంలో మరిన్ని జాగ్రత్తలు పాటించాలని, వారి పర్యటనలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలని ఆదేశించారు. ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టుల ప్రభావంపై ఆరాతీసిన ఆయన గత ఎన్నికల సమయంలో ఏమైనా ఘటనలు జరిగాయా, లేదా అనే దానిపై సబ్ డివిజన్ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. తమ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రతి పోలింగ్ బూత్‌ను సీఐ, ఎస్‌ఐలు తప్పకుండా సందర్శించాలని, సిగ్నల్ లేని పోలింగ్ బూత్‌లు, రాజకీయంగా సమస్యాత్మక బూత్‌ల పరిధిలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆయన సూచించారు. ఎన్నికల సమయంలో ఇబ్బందులు పెట్టేవారిని కనిపెట్టి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని, అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి గంజాయి, మద్యం, సారా వంటివి రవాణా కాకుండా నిరోధించాలని ఎస్పీ ఆదేశించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు పైబడి నగదు తీసుకెళ్లే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా, సీఐలు గజేంద్రకుమార్, రామారావు, సబ్ డివిజన్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు



ముంచంగిపుట్టులో బాలికల పాఠశాల-2లో తనిఖీ చేస్తున్న డీడీ కొండలరావు

ముంచంగిపుట్టు: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ వై.కొండలరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-2, బాలిక పాఠశాల-2లలో బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. పాఠశాలల్లో అనారోగ్యంతో ఉన్న విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులను తప్పనిసరిగా ఆస్పత్రికి తీసుకువెళ్లి మెరుగైన వైద్యం అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఇళ్లకు పంపించరాదని సూచించారు. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉంటే పాడేరులో జిల్లా ఆస్పత్రికి తరలించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి తల్లిదండ్రులకు తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీడీ తెలిపారు.

రబీకి 'సీలేరు' జలాలు విడుదల



కెనాల్ ద్వారా విడుదల చేసిన నీరు

మోతుగూడెం: లోయర్ సీలేరు జల విద్యుత్ కేంద్రాల నుంచి రబీ అవసరాలు ఉభయగోదావరి జిల్లాలకు బుధవారం నుంచి 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు చీఫ్ ఇంజినీర్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలకృష్ణ తెలిపారు. జల విద్యుత్ ఉత్పత్తి అనంతరం నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఇరిగేషన్ అధికారుల ఆదేశాల మేరకు రోజుకు నాలుగు వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్టు వారు చెప్పారు. ఇరిగేషన్ అధికారులు ఇంకా ఎక్కువ నీటిని విడుదల చేయాలని ఆదేశిస్తే డొంకరాయి డ్యామ్ ద్వారా విడుదల చేస్తామన్నారు. గత సంవత్సరం రబీ అవసరాలకు సుమారు 13 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు తెలిపారు.

హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు విడుదల

తగరపువలస(విశాఖ): దక్షిణ భారత హిందీ ప్రచార సభ-చెన్నై ఆధ్వర్యంలో గత నెల 10, 11వ తేదీల్లో నిర్వహించిన హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా జరిగిన పరీక్షల్లో 36 మందికి గానూ 25 మంది ప్రథమ శ్రేణిలో, 11 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళి



డార్మిటరీను ప్రారంభిస్తున్న ఏఎస్పీ జగదీష్ అడహళి

రాజవొమ్మంగి : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసుశాఖ చర్యలు తీసుకున్నట్టు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళి తెలిపారు. ఎన్నికల విధుల కోసం వచ్చే ప్రత్యేక పోలీసు బృందాలు ఉండేందుకు స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన డార్మిటరీని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఎస్‌టీ, సీపీఎఫ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర పోలీసు బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ఇంత వరకు 50 ఆయుధాలను వాటి యజమానుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇచ్చిన గడువులోగా నాటు తుపాకులను, ఇతర ఆయుధాలను దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని, అలా చేయని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రంపచోడవరం-చింతూరు సరిహద్దుల్లో, ప్రధాన పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకు ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డివిజన్‌లో మొత్తం 258 పోలింగ్ కేంద్రాలుండగా, వాటిలో 101 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి, అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు ఏఎస్పీ చెప్పారు. వాహనాల తనిఖీ ముమ్మరం చేసినట్టు తెలిపారు. ఆయన వెంట స్థానిక సీఐ సన్యాసినాయుడు, రాజవొమ్మంగి ఎస్ఐ వెంకయ్య, జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు, స్పెషల్‌బ్రాంచ్ హెచ్‌సీ దుర్గారావు ఉన్నారు.

అనంతుడి కల్యాణోత్సవాలకు అంకురార్పణ

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీ వరకు వారం రోజులు జరగనున్న అనంతుడి కల్యాణోత్సవాలకు బుధవారం రాత్రి మృత్యం గ్రహణంతో అంకురార్పణ జరిగింది. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం మృత్యం గ్రహణం(పుట్ట బంగారం తేవడంతో)తో కల్యాణోత్సవాలకు వేద పండితులు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా కుంతీ మాధవ స్వామి ఆలయంలోని చక్రపెరుమాళ్లను పల్లకీలో సంత పాత స్థలం వద్దకు తీసుకువచ్చారు. ఇక్కడ చక్ర పెరుమాళ్లకు, మేదిని మాత(భూమాత)లకు విశేష పూజలు చేశారు. అక్కడ నుంచి పుట్ట బంగారాన్ని కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి తీసుకువెళ్లి పాళికల్లో వేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మోదమ్మ ఉత్సవాలకు నూతన కమిటీ ఎన్నిక



ఉత్సవ కమిటీ సభ్యులు

సాక్షి,పాడేరు: నియోజకవర్గ కేంద్రం పాడేరులో మే 19, 20, 21 తేదీల్లో నిర్వహించనున్న మోదకొండమ్మ తల్లి ఉత్సవాలకు సంబంధించి నూతన కమిటీని బుధవారం ఎంపిక చేశారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావుల సూచనలతో ఆలయ కమిటీ, గ్రామపెద్దలు సమావేశమయ్యారు. అనంతరం ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఇతర పెద్దలంతా ఉత్సవ కమిటీని ఎంపిక చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కొట్టగుళ్లి రామారావు, ప్రధాన కార్యదర్శులుగా తమర్బ ప్రసాద్‌నాయుడు, కొమ్మొజు వెంకటరమణ, యాదగిరి శ్రీను, సభ్యులను ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

గంజాయి స్వాధీనం..?

మారేడుమిల్లి: లోతట్టు ప్రాంతం నుంచి మండల కేంద్రం మారేడుమిల్లి మీదగా మైదాన ప్రాంతానికి తరలిస్తున్న గంజాయిని మారేడుమిల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నట్టు తెలిసింది. గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 20 కిలోల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

జింక కళేబరానికి దహనం


జింక కళేబరాన్ని దహనం చేస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని సూరంపాలెం అడవుల్లో లభించిన జింక కళేబరాన్ని ఫారెస్టు రేంజ్ అధికారి సయ్యద్ సెహన్‌షా ఆధ్వర్యంలో స్థానిక అటవీ అధికారులు, సిబ్బంది బుధవారం చితిక పేర్చి అదే ప్రాంతంలో దహనం చేశారు. అటవీ ప్రాంతంలో జింక కళేబరాన్ని అటవీ అధికారులు మంగళవారం గుర్తించిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం చేయించలేని పరిస్థితిలో జింక కళేబరం డీకంపోజ్ అయి ఉన్నట్టు రేంజర్ సెహన్‌షా చెప్పారు. వీఆర్వో భూలక్ష్మి, ఎఫ్ఎస్ఓ రాము, ఎఫ్‌బీఓ సూర్యప్రసాద్ తదితరులున్నారు.

భారీ గిరినాగు హల్‌చల్


రైతుల చేతి హతమైన భారీ గిరినాగు

దేవరాపల్లి: దేవరాపల్లి శివారు ఒడ్డు చింతల కల్లాల్లో గిరినాగు హల్‌చల్ చేసింది. రైతులు కల్లాల నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా దారికి అడ్డంగా ఉన్న పాము రైతుల కంట పడింది. విషసర్పమైన గిరినాగును చూసిన స్థానిక రైతులు భయాందోళనలతో పరుగులు తీశారు. కొందరు ధైర్యం చేసి హతమార్చేందుకు ప్రయత్నించగా గిరినాగు కాటేసేందుకు పడగెత్తడంతో వెనక్కి తగ్గారు. ఎంతకీ అక్కడి నుండి వెళ్లక పోవడంతో రైతులు అతి కష్టం మీద గునపంతో కొట్టి చంపారు. రైతుల చేతిలో హతమైన గిరినాగు సుమారు 13 అడుగుల పొడవు ఉంది.

ఎన్నికల ప్రక్రియలో ఆర్వోలే కీలకం

- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి
- పార్లమెంట్ నియోజకవర్గానికి ఆర్వోగా కలెక్టర్
- జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ ప్రతి అంశం పర్యవేక్షణ
- ఎన్నికల ప్రక్రియలో బీఎల్వో, ప్రిసైడింగ్ అధికారులూ ముఖ్యమే..

అరకు పార్లమెంట్ ఆర్వోగా
పార్వతీపురం మన్యం కలెక్టర్
జిల్లా ఎన్నికల అధికారిగా అల్లూరి కలెక్టర్
పాడేరు ఆర్వోగా జాయింట్ కలెక్టర్
అరకులోయ ఆర్వోగా ఐటీడీఏ పీవో
రంపచోడవరం ఆర్వోగా సబ్‌కలెక్టర్



సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది.ఈ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు జిల్లాలోని ఎన్నికల యంత్రాంగం తగిన పనుల్లో నిమగ్నమైంది.కొత్త జిల్లా కావడంతో ఈసారి సార్వత్రిక ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యం నెలకొంది. జిల్లాలో పాడేరు,రంపచోడవరం,అరకులోయ అసెంబ్లీ స్థానాలతో పాటు అరకులోయ పార్లమెంట్ స్థానం ఉంది. అరకులోయ పార్లమెంట్ పరిధిలో పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. విస్తీర్ణంలో అతి పెద్ద జిల్లాగా, అరకులోయ అతిపెద్ద పార్లమెంట్‌గాను గుర్తింపు పొందాయి. పూర్తిగా గిరిజన ప్రాంతాలు కావడంతో సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ అవసరమైన ఎన్నికల అధికార యంత్రాంగాన్ని నియమించింది.

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు

ప్రతి నియోజకవర్గానికి అవసరమైన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల విధుల్లో చురుగ్గా పనిచేస్తాయి. మద్యం, డబ్బు అక్రమంగా తరలించే సామగ్రిపై నిరంతరం తనిఖీలు చేపడతాయి.

అరకు పార్లమెంట్ ఆర్వోగా పార్వతీపురం మన్యం కలెక్టర్

జిల్లాలోని అరకు పార్లమెంట్ స్థానానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను నియమించారు. జిల్లా ఎన్నికల అధికారిగా అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీత వ్యవహరిస్తారు.పాడేరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్,అరకులోయ రిటర్నింగ్ అధికారిగా పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్,రంపచోడవరం ఆర్వోగా సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌లు వ్యవహరిస్తారు. అరకు పార్లమెంట్, జిల్లా పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియకు పూర్తి బాధ్యత రిటర్నింగ్ అధికారిదే.అధికారుల విధులు,శిక్షణ కార్యక్రమాలన్ని జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ పర్యవేక్షిస్తారు. బూత్ లెవెల్ అధికారి నుంచి జిల్లా కలెక్టర్, పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల ఆర్వోలంతా ఎన్నికల నియమావళి ప్రకారం సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా నిర్వహిస్తారు.రిటర్నింగ్ అధికారులు,ఇతర విభాగాల అధికారులంతా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే పనిచేయాలి.నామినేషన్ల ప్రక్రియ నుంచి పోలింగ్,కౌంటింగ్ వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలిసిందే. ఎక్కడ పొరబాట్లు జరిగిన ఎన్నికల కమీషన్ క్షణాల్లో సంభందిత బాధ్యులపై కఠిన చర్యలు చేపడుతుంది.

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు

ప్రతి రిటర్నింగ్ అధికారికి సహాయకులుగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఎన్నికల సంఘం నియమించింది.నియోజకవర్గం పరిధిలోని తహసీల్దార్ స్థాయి అధికారులు ఏఆర్వోలుగా ఉంటారు.అన్ని అంశాల్లోను ఆర్వోలకు సహాయ పడుతుంటారు.విధులకు సంభందించి ఏఆర్వోగా ఆయన సంతకాలు కీలకమే.

రిటర్నింగ్ అధికారి విధులు

ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్ అధికారి కీలకం .ప్రతి నియోజకవర్గానికి ఎన్నికల సంఘం ద్వారా నియమితులైన ఆర్వో ఎన్నికల నోటిఫికేషన్ జారీ నుంచి ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం అవుతారు. ఎన్నికల ప్రవార్తన నియమావళి అమలు,నామినేషన్ల స్వీకరణ,పరిశీలన, తిరస్కరణ,ఉప సంహరణ,పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా వెల్లడి, బ్యాలెట్ పేపర్ల ముద్రణ,డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా ఈవీఎంల తరలింపు, పోలింగ్ పర్యవేక్షణ, స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు తరలింపు,కౌంటింగ్‌లో ఆర్వోలే కీలక బాధ్యతలు నిర్వహిస్తారు.

మైక్రో పర్యవేక్షకులు

ఎన్నికలు జరిగే తీరును సూక్ష్మ స్థాయిలో సమగ్ర పరిశీలన జరిపేందుకు ప్రతి పోలింగ్ కేంద్రానికి మైక్రో పర్యవేక్షకులు పనిచేస్తారు.

ప్రిసైడింగ్ అధికారులు

ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారిని జిల్లా ఎన్నికల అధికారి నియమిస్తారు.పోలింగ్ ప్రక్రియను స్వేచ్ఛగా నిర్వహించడంలో ఆయన విధులు కీలకం.

సెక్టోరియల్ అధికారి

ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పన,శాంతిభద్రతలకు పరిరక్షణలో సెక్టోరియల్ అధికారుల విధులు కీలకం . ప్రతి ఆరు పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టోరియల్ అధికారిని నియమిస్తారు.

నాటు తుపాకీలు అప్పగించాలి

చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్


స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులతో ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్, ఎస్ఐ అరుణ్‌కిరణ్

చింతపల్లిరూరల్: నాటు తుపాకీలు, లైసెన్స్ లేని ఆయుధాలను సమీపంలో పోలీసుస్టేషన్‌లో స్వచ్ఛందంగా అప్పగించాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. చింతపల్లి మండలంలో స్వాధీనం చేసుకున్న 10 నాటు తుపాకులను చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల నుంచి 25 నాటు తుపాకులు స్వాధీనం చేసుకోన్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు అతిక్రమించి నాటు తుపాకులు, లైసెన్స్ లేని ఆయుధాలు కలిగి ఉన్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నాటు తుపాకుల స్వాధీనంలో ప్రత్యేక శ్రద్ధ వహించినందుకు ఎస్ఐ అరుణ్‌కిరణ్, సిబ్బందికి ఆయన అభినందించారు.

ప్రజల ఆశీర్వాదంతో జగనన్నే మళ్లీ సీఎం కావడం ఖాయం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


కొత్తమ్మతల్లిని దర్శించుకున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తనూజరాణి, రేగం మత్స్యలింగం


కొత్తూరు చర్చ్‌లోని ప్రార్థనలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

అనంతగిరి: ప్రజల ఆశీర్వాదంతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ స్పష్టం చేశారు. మండలంలోని కాశీపట్నంలో కొత్తమ్మతల్లి అమ్మవారిని ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంతో కలిసి ఆయన బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొత్తూరులోని చర్చ్‌లో పాస్టర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. శివలింగపురం గ్రామంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ జగనన్న ఐదేళ్ల పాలనలో మన్యంలో ఎన్నడూ ఊహించని అభివృద్ధి, గిరిజన సంక్షేమం జరిగిందన్నారు. పెత్తందారులకు పేదలకు జరుగుతున్న యుద్ధంలో పేదలకు అండగా జగనన్న నిలబడ్డారన్నారు. ప్రతిపక్షాలు పొత్తులతో కుట్ర రాజకీయాలతో మోసపూరిత హామీలు చేస్తున్నారని, ఎవరూ నమ్మవద్దన్నారు.సుపరిపాలన అందించిన జగనన్నకు ప్రజలంతా అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, ఎంపీపీ శెట్టి నీలవేణి, వైస్ ఎంపీపీ దూరు జయవరిణి, మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, ఎంపీటీసీ మితుల, సర్పంచులు పాగి అప్పారావు, సింహాద్రి, సన్యాసిరావు, మజ్జి అప్పారావు, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ గంగులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర్యానారాయణ, ప్రధాన కార్యదర్శి శెట్టి లక్ష్మణ్‌రావు, మాజీ జెడ్పీటీసీ గంగన్నదొర, నాయకులు ఆనంద్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఓఎన్‌జీసీ అధికారులు

రంపచోడవరం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు సకాలంలో అందించే విధంగా దేశంలోని రాష్ట్రంలోని వివిధ రకాలైన పెద్ద పెద్ద సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ పీహెచ్. శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక ఐటీడీఏ ప్రాంగణంలో ఓఎన్‌జీసీ (రాజమండ్రి) ఆర్థిక సహాయంతో రూ.13 లక్షల వ్యయంతో గిరిజన ప్రాంతంలోని ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించే విధంగా అంబులెన్స్‌ను ఇ.డి.అసిస్టెంట్ మేనేజర్ సనాతనుదాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం అంబులెన్స్‌ను ఏడీఎంహెచ్‌ఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీవో జనరల్ సీహెచ్. శ్రీనివాస రావు మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించే విధంగా అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఓఎన్‌జీసీ అధికారులకు గతంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ప్రతిపాదనలు అందజేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినందుకు ఐటీడీఏ ద్వారా ఓఎన్‌జీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఓ డీఎన్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

దిగువకుమడ వద్ద రెండు ద్విచక్ర వాహనాల ఢీ


గాయపడిన అనిల్‌కుమార్


ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన బైక్

ముంచంగిపుట్టు: మండలంలో కుమడ పంచాయతీ దిగువకుమడ గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం యమహా ప్లాంటర్, బైక్ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కుమడ పంచాయతీ బూరుగుమెట్ట గ్రామానికి చెందిన బి.అనిల్‌కుమార్ ఐస్‌లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే వాటిని అమ్ముకుని దిగువకుమడ వైపు వస్తుండగా.. అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలానికి చెందిన ఓండ్రు దేముడు బైక్‌పై మరో ఇద్దరినీ ఎక్కించుకొని అతివేగంతో బూసిపుట్టు వెళ్తూ బలంగా ఢీ కొట్టాడు. దీంతో అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు సంతోష్, గీతాంజలి వైద్య సేవలందించారు. ప్రస్తుతం పరస్థితి బాగానే ఉందని, రెండు రోజులు పర్యవేక్షణలో ఉంచుతామని వైద్యులు తెలిపారు. క్షతగాత్రుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు బైకులను ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

జీసీసీ డిపోల్లో తనిఖీలు


వాతంగి డిపోలోని స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారుల బృందం

రాజవొమ్మంగి: జాయింట్ కలెక్టర్ భావన, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశాల మేరకు జిల్లా అధికారుల బృందం బుధవారం మండలంలోని పలు జీసీసీ డిపోలను బుధవారం సందర్శించింది. మండలంలోని చెరకుంపాలెం, కొమరాపురం, వాతంగి డిపోల్లో మిడ్డేమీల్స్‌కు సంబంధించిన బియ్యం, ఇతర సరకుల స్టాక్‌ను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. బృందంలో పాల్గొన్న డీఎస్‌వో శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల కొన్ని మండలాల్లోని జీసీసీ డిపోల్లోని స్టాకులో వ్యత్యాసం ఉండడంతో జేసీ భావన, రంపచోడవరం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. డిపోల్లో తనిఖీలకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఏఎస్ఓ శ్రీహరి, జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ తదితరులున్నారు.

తాండవలో రొయ్యల వేట ప్రారంభం


తాండవ జలాశయంలో రొయ్యల వేట

గొలుగొండ : తాండవ జలాశయంలో రొయ్యల వేట ప్రారంభం అయ్యింది. బుధవారం ముహూర్తం ప్రకారం అన్ని ప్రాంతాల్లో రొయ్యల వేటను ప్రారంభమైంది. ఏటా మార్చి నుంచి జూన్ 10 వరకు తాండవ జలాశయంలో రొయ్యల వేట సాగిస్తుంటారు. జాలర్ల సంఘం తీర్మాణం ప్రకారం బుధవారం వేట ప్రారంభం కావడంతో గొలుగొండ, నాతవరం మండలాల్లో ఉన్న 430 మంది జాలర్లు వేట ప్రారంభించారు. రొయ్యలను కొనుగోలు చేసిన వ్యాపారులు గొలుగొండ రొయ్యల కేంద్రం వద్దకు తీసుకువస్తారు. ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద తామర్ల కొండబాబు అనే వ్యక్తి అదృశ్యమైనట్టు పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలివి. దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ, బల్లిపురం గ్రామానికి చెందిన తామర్ల కొండబాబు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి తిరిగి అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రావడం జరిగిందని, ఆ తరువాత ఆచూకీ తెలియలేదని ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కొండబాబు తండ్రి బుచ్చిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రాత్రిపూట తనిఖీలు ముమ్మరం


రాత్రి పూట తనిఖీలు చేస్తున్న సీఐ రమేష్, సిబ్బంది

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో రాత్రిపూట పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. జి.మాడుగుల సీఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు రోజు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5గంటల వరకు తనిఖీలు చేస్తున్నారు. కొన్నిరోజులుగా మండలంలో దొంగతనాలు అధికంగా జరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మండల కేంద్రంలో రాత్రిపూట పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో రాకపోకలు సాగించే వాహనాలను ఆపి తనిఖీ చేసి, వివరాలు సేకరించి విడిచిపెడుతున్నారు. అనుమానితులను పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నారు. మండల వాసులు రాత్రిపూట ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, దొంగతనాలు జరుగుతున్న దృష్ట్యా అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని, పోలీసులకు సహకరించాలని సీఐ రమేష్ కోరారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

తాత వెంటే తండ్రి...


తండ్రికి దహన సంస్కారాలు చేస్తున్న కుమార్తె ప్రవల్లిక

అనకాపల్లి/తుమ్మపాల : రోడ్డు ప్రమాదంలో తండ్రి మరణంతో మనస్తాపానికి గురైె కొడుకు తాసుబిల్లి సూరిఅప్పారావు మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. సూరిఅప్పారావు మృతదేహానికి తలకొరివి పెట్టి కుమార్తె ప్రవల్లిక కన్న రుణం తీర్చుకుంది. వివరాలివి. మండలంలో బట్లపూడి గ్రామానికి చెందిన తాసుబిల్లి నూకరాజు 20 రోజుల క్రితం శంకరం వద్ద జాతీయ రహదారి దాటుతూ ఇంటికి వస్తుండగా కారు ఢీకొట్టి అక్కడిక్కడే మృతి చెందారు. దీంతో మనస్తాపానికి గురైన కొడుకు సూరిఅప్పారావు ఆందోళనతో మంచాన పడ్డాడు. సూరిఅప్పారావుకు భార్య భారతి, ఇద్దరు ఆడపిల్లలు ప్రవల్లిక, భవ్య ఉన్నారు. ప్రవల్లిక ఇంటర్ రెండవ సంవత్సరం, భవ్య 9వ తరగతి చదువుతుంది. సూరిఅప్పారావు గ్రామంలో చిన్నచిన్న కూలిపనులు చేసుకుంటుండగా కుటుంబ బాధ్యతలు అన్నీ తండ్రి నూకరాజే చూసుకునేవారు. తండ్రి మృతితో మనోవేదనతో సూరిఅప్పారావు చనిపోయాడు. అతనికి మగ బిడ్డలు లేకపోవడంతో తన తండ్రికి తానే తలకొరివి పెడతానంటూ ముందుకొచ్చింది పెద్ద కుమార్తె ప్రవల్లిక. తండ్రి దేహానికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది. స్వల్ప కాలంలోనే తండ్రీకొడుకుల మరణంతో మగదిక్కు లేని కుటుంబంలో భార్యపిల్లలు దిక్కులేని వారయ్యారు.

భక్తకోటితో పులకించిన ఉపమాక

- జనసంద్రమైన గరుడాద్రి
- వెంకన్న కల్యాణోత్సవానికి లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం
- పట్టువస్త్రాలు సమర్పించిన హెటిరో ప్రతినిధులు


ఉపమాకలో బేడా మండపం చుట్టుప్రదక్షణ చేస్తున్న డీఐజ విశాల్‌గున్ని


స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లో బారులు తీరిన భక్త జనం


వడ్డాదిలో ధ్వజ స్థంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


వడ్డాది ఆలయంలో బారులు తీరిన భక్తులు

నక్కపల్లి : భక్తకోటితో ఉపమాక పులకించింది. కోనేటి రాయుడు కల్యాణాన్ని కనులారా తిలకించేందుకు వచ్చిన భక్తజనంతో ఉపమాక కిటకిటలాడింది. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నాడు రాత్రి స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారు జామున 2 గంటలకు కొండపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్‌కు తొలి అభిషేకం నిర్వహించారు. నిత్యార్చనలు పూర్తి చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. గరుడాద్రిపై స్వామివారు ఏకశిలపై అశ్వారూడుడై షడ్భుజాలతో వెలిసారు. కల్యాణం రోజున స్వామి నిజ స్వరూపాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజామున రెండుగంటల నుంచే భక్తజనం మెట్లమార్గం గుండా మూలవిరాట్ సన్నిధికి చేరారు. ఆలయ ముఖద్వారానికి ఎదురుగా ఉన్న ఆస్థాన మండపం ,బేడామండపం, స్వామి ఉత్సవమూర్తులున్న మండపం, మెట్లమార్గం ఉపమాక పురవీధులు వేలాది మంది వెంకన్న భక్తులతో కిటకిటలాడాయి.

పుష్కరిణిలో పుణ్యస్నానాలు...

బ్రహ్మ తపస్సు చేసిన బందుర సరస్సు (పుష్కరిణిలో) పుణ్యస్నానమాచరించి స్వామి దర్శనానికి వచ్చారు. విశాఖ జిల్లా నుంచే కాకుండా ఉభయగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం, ఒరిస్సా రాష్ట్రాలనుంచి కూడా భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు.

వెంకన్న సన్నిధిలో డీఐజీ

ఉపమాక వేంకటేశ్వరస్వామిని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని , జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు దర్శించుకున్నారు. డీఐజీకి ఆలయ అర్చకులు పరివట్టం కట్టి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బేడామండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

కమనీయం.. వడ్డాది వెంకన్న కల్యాణం

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వర స్వామి 151వ కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల కల్యాణ వేడుకల్లో భాగంగా తొలిరోజు బుధవారం స్వామివారికి ఏకాదశి ప్రత్యేక పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చే వడ్డాది వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం పలు గ్రామాల భక్తులు పోటెత్తారు. గోవింద నామ స్మరణతో వడ్డాది గిరిజాంబ కొండ మార్మోగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల మండలి సభ్యులు దొండా కన్నబాబు, శ్రీరామ్ కుటుంబ సభ్యులకు దేవస్థానం ఈవో శర్మ తొలి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు. తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు వేంకటేశ్వరస్వామి తొలి దర్శనం కోసం ఆలయం వద్ద బారులు తీరారు. కొంతమంది భక్తులు ఆలయ సమీపంలో తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం నుంచి జోరున వర్షం కురుస్తున్నా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రికి గిరిజాంబ కొండపై ఆలయ మండపంలో స్వామి వారి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవంలో స్వామి వారి పల్లకి మోయడానికి భక్తులు పోటీపడ్డారు. పలు గ్రామాల నాయకులు, అధికారులు స్వామివారిని దర్శించుకోగా దేవస్థానం ఈవో శర్మ దగ్గరుండి పూజా కార్యక్రమాలు చేయించి ప్రసాదాలు అందించారు.

